చి'వరి'కి ఎస్సారెస్పీ నీరేదీ!

- తగ్గుముఖం పట్టిన భూగర్భ జలాలు
- ఎండిపోయే దశలో పంటలు
- నీరందించి ఆదుకోవాలని రైతన్నల వేడుకోలు


నేలమర్రి వద్ద ఎండిపోయిన ఎస్సారెస్పీ కాలువ

మునగాల : రాష్ట్ర ప్రభుత్వం శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ జలాలను విడుదల చేసి పదిరోజులు అవుతున్నప్పటికీ నేటివరకు తమ గ్రామాలకు చుక్కనీరు రాలేదని మండలంలోని నేలమర్రి, ఈదులవాగుతండా, వెంకట్రాంపురం, తాడువాయి, ఎస్‌ఎంపేట గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ చివరి భూములకు ఎస్సారెస్పీ జలాలను వారబందీ విధానంలో అందిస్తామని సంబంధిత శాఖ అధికారులు ప్రకటించినప్పటికీ ఇంతవరకు అతీగతీ లేదని, ఫలితంగా ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన పైర్లు ఎండిపోయే దశకు చేరుకున్నాయన్నారు. సాగు నీరు విడుదల చేయకపోవడంతో భూగర్భజలాలు పూర్తిస్థాయిలో తగ్గడంతో బోర్లు, బావులు ఎండిపోతున్నాయి. గతంలో వారబందీ పద్ధతిలో ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయడంతో చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండి భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి యుద్ధప్రాతిపదికన ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

భూగర్భ జలాలు తగ్గాయి



ప్రస్తుత సీజన్‌లో ఎస్సారెస్పీ కాలువలకు సాగు నీటిని విడుదల చేయకపోవడంతో చెరువులు, కుంటలలో నీటిమట్టం గణనీయంగా పడిపోయి భూగర్భ జలవనరులు పూర్తిగా పడిపోతున్నాయి. దీంతో వేసవిలో ఈ ప్రాంతంలో పశువులకు, ప్రజలకు తాగునీటికి కటకట ఏర్పడే ప్రమాదముంది.

– చామకూరి సతీష్ గౌడ్, రైతు, నేలమర్రి

క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఓపీఎస్‌ల వినతి


మంత్రి ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఓపీఎస్‌లు

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు శనివారం సెక్రటేరియట్‌లోని మంత్రి ఛాంబర్‌లో కలిశారు. తమను జూనియర్ పంచాయతీ సెక్రటరీలుగా క్రమబద్ధీకరించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్విజ్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన 'తేజ' విద్యార్థులు


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో క్విజ్ నిర్వాహకులు

కోదాడ : హైదరాబాద్‌లోని భారతీ విద్యాభవన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రేక్యాప్స్ సంస్థ శనివారం నిర్వహించిన ఆస్పిరెంట్ క్విజ్ పోటీలలో కోదాడలోని తేజ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు ఉప్పెల రమాసోమిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 90 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీలలో తేజ విద్యాలయానికి చెందిన 8వ తరగతి విద్యార్థులు దేవరపల్లి సునందువర్ధన్‌రెడ్డి, నోముల సృజన్‌గుప్తల జట్టు 425 పాయింట్లతో ప్రథమ స్థానం సాధించి రూ.50 వేల నగదు బహుమతి పొందినట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

కోదాడ : కోదాడ పట్టణంలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ చెప్పారు. పట్టణంలోని సీసీరెడ్డి విద్యానిలయం, బాలికల పాఠశాల సెంటర్‌లలో ఈ పరీక్ష నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలో 201 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 164 మంది హాజరు కాగా 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సీసీరెడ్డి సెంటర్‌లో 216 మందికి గాను 180 మంది పరీక్ష రాయగా 36 మంది గైర్హజరయ్యారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మునగాల : ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరిపైర్లలో పలు రకాల తెగుళ్లు ఆశించినట్లు తమ దృష్టికి వచ్చిందని, వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోదాడ డివిజన్ వ్యవసాయ సంచాలకులు తంగెళ్ల వాసు సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రం శివారులో పలు వరిపైర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని దీని నివారణకు కార్బోహైడ్రేట్ 350 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఏ.అనిల్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారులు ఉప్పయ్య, ముస్తఫా, నాగు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

మోతె : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మోతె తహసీల్దార్ ప్రకాష్‌రావు అన్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామ శివారులో సిరికొండ రోడ్డు నుంచి మొగ్గయ్యగూడెం గ్రామానికి వెళ్లే డొంకను రాఘవాపురం గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకొని జేసీబీతో చదును చేసుకుంటున్నారని గ్రామానికి చెందిన కోల లక్ష్మి భర్త నర్సయ్య తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం తహసీల్దార్ డొంకను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రక్తదానం చేస్తే ఆరోగ్యానికి మేలు


రక్తదానం చేస్తున్న నాగేంద్రబాబు

హుజూర్‌నగర్ : రక్తదానం చేస్తే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని డీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబూరావు అన్నారు. హుజూర్‌నగర్‌కి చెందిన డయాలసిస్ పేషెంట్ వెంకట రామయ్యకి అవసరమైన రక్తాన్ని శనివారం డీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత నాగేంద్రబాబు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎంపీడీఓ లావణ్యతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ) 2024– 2025 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రణాళికలు రూపొందించుటకు ఆయా శాఖల అధికారులు పనులు గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన దఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏఓ రావిరాల స్వర్ణ, పంచాయతీరాజ్ ఏఈ సాయిరాం, అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

26న కోదాడలో బైక్, ట్రాక్టర్ ర్యాలీ

మునగాల : కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కోదాడలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించబోయే ట్రాక్టర్, ద్విచక్ర వాహన ర్యాలీని జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. శనివారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన మండల రైతు సంఘం కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామినథన్ కమిటీ సిఫారసు ప్రకారం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.3.500, నిరుద్యోగులకు సంత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నేటికీ అమలుపర్చలేదన్నారు. ఉపాధి హామీ పథకంలో కోతలు విధించి పని దినాలు తగ్గించిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు దేవరం వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు చందా చంద్రయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ సైదా, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆరె.రామకృష్ణారెడ్డి, సొంపంగు జానయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి బచ్చలకూరి స్వరాజ్యం, డీఐఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు చినసైదులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : సరిత



మాట్లాడుతున్న సరిత

కోదాడ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా సంరక్షణ సీఐడీ, ఐపీఎస్ అధికారి కెజివి సరిత అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని న్యూ విజన్ స్కూల్‌లో జరిగిన ప్రథమ వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్యంలో నేర్పిన పాఠం భవితవ్య నిర్మాణానికి భీజం అని తెలిపారు. పట్టణ, గ్రామీణ స్థాయి విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్య అందించాలనే సంకల్పంతో తల్లిదండ్రుల కోరిక మేరకు న్యూ విజన్ పాఠశాలను కోదాడలో నెలకొల్పడం జరిగిందన్నారు. బాల్యంలో నేర్పిన ఆట, పాట, విద్య జీవితాన్ని ఒక మలుపు తిప్పుతుందన్నారు. చక్కని విద్యా ప్రణాళికతో నిష్ణాతులైన అధ్యాపక బృందంతో పాఠశాల నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేస్తున్న న్యూ విజన్ పాఠశాలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎండి.సలీవ షరీఫ్, పాఠశాల చైర్మన్ సీహెచ్‌జీకె ప్రసాద్, డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, ఎస్‌ఆర్‌ఎం స్కూల్స్ గ్రూపు అధినేత కె.శ్రీదేవి, డైరెక్టర్ సీహెచ్.గోపిచంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


స్వపరిపాలన వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు.. ఉపాధ్యాయులు, వివిధ స్థాయి అధికారుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుజ్జుల నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేణు మృతి బాధాకరం


వేణు మృతదేహానికి నివాళులర్పిస్తున్న తెనాలి ఎమ్మెల్యే శివకుమార్

నడిగూడెం : వేణు అకాల మృతి బాధాకరమని ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా తెనాలి ఎమ్మెల్యే అన్నబత్తుని శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని డాక్రి సంస్థలో డైరెక్టర్‌గా పనిచేస్తున్న కన్నెగంటి హిమబిందు భర్త వేణు (53) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. హిమబిందు శివకుమార్‌కు సోదరి. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట రీసెర్స్ అధినేత జితేంద్రబాబు, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

సాగర్ నీటిని విడుదల చేయాలి


మాట్లాడుతున్న అనంతప్రకాష్

పాలకవీడు : బోరు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, సాగర్ నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతాంగాన్ని కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు పగడాల మట్టేష్, సుంకరి క్రాంతికుమార్, గుర్రం ధనమూర్తి, కొప్పు రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

పట్టు రైతుల క్షేత్ర సందర్శన

గరిడేపల్లి : గడ్డిపల్లిలోని కేవీకేలో మూడు రోజులు నైపుణ్య శిక్షణ పొందుతున్న రైతుల బృందం శనివారం సిద్దిపేట జిల్లా చండ్లపూర్ గ్రామంలోని ఐలయ్య, నర్సింహుల మల్బరీ క్షేత్రాన్ని సందర్శించినట్లు కేవీకే పట్టు విభాగం శాస్త్రవేత్త మాధురి తెలిపారు. ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం ములుగు, సిద్దిపేట జిల్లాల ఆర్థిక సహకారంతో సందర్శించినట్లు తెలిపారు. సీఎం బాబు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ సీఎస్‌ఆర్, మహేష్, వినోద్‌కుమార్, వీరకుమార్ పాల్గొన్నారు.

టీబీఈఎస్‌ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

మోతె : మండల కేంద్రంలో టీబీఈఎస్‌ఎస్ (తెలంగాణ బంజార ఎంప్లాయీస్ సేవా సంఘ్) క్యాలెండర్‌ను శనివారం ఎంపీడీఓ హరిసింగ్‌నాయక్ ఆవిష్కరించారు. టీబీఈఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డి మంగత్య, జిల్లా కోశాధికారి డి.బాలాజి, డి.లాలు, వీరన్న, రాంకోటి, తిరుపతి, మోహన్‌లక్ష్మణ్, రవీందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల శోభాయాత్ర

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని సీతారాంపురంలో శనివారం అయోధ్య రామయ్య అక్షింతల కలశాల శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో అక్షింతల కలశాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అద్దంకి సైదేశ్వరరావు, అర్చకులు ముడుంబై దామోదరాచార్యులు, గ్రామపెద్దలు వెంగళరావు, వెంకటేశ్వరరావు, సీతారామయ్య, కృష్ణారావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని వినతి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డులో ఉన్న రాఘవేంద్ర, మల్లికార్జున రైస్ మిల్లుల నుంచి కలుషితపు నీరు బయటకు విడుదల చేస్తున్నారని, ఆయా మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని 5వ వార్డు (నర్సయ్యగూడెం) గ్రామస్తులు కోరారు. ఈమేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ నర్సయ్యకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా మిల్లుల నుంచి వస్తున్న కలుషితపు నీరు నర్సయ్యగూడెం చెరువులో కలుస్తుండడంతో చేపలు, ఆ నీరు తాగి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ పనులకు రైతులు ఆ నీటిని వినియోగిస్తుండడంతో చర్మవ్యాధులకు గురి అవుతున్నారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కొప్పు రామకృష్ణ, కాలువ సైదులు, కొప్పు సోమేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌కు కొక్కిరేణి పాఠశాల ఎంపిక

మునగాల : మండలంలోని కొక్కిరేణి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపికైంది. రాష్ట్ర శాస్త్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన 2023–24 ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా సైన్స్ ఫేర్, తెలంగాణ రాష్ట్ర సాంకేతిక మండలి హైదారాబాద్ ఆదేశానుసారం ఆన్‌లైన్‌లో నిర్వహించి మూల్యాంకనం చేసిన ఉప అంశాలలో పాఠశాల ఎంపికైనట్లు, శనివారం ఇందుకు సంబంధించిన లేఖ పాఠశాలకు అందినట్లు ప్రధానోపాధ్యాయుడు యాకూబ్‌అలీ తెలిపారు. సైన్స్ టీచర్ మధు మార్గదర్శకత్వంలో తొమ్మిదవ తరగతి విద్యార్థి వాసా నిఖిల్ రూపొందించిన ఫిల్టరైజేషన్ గ్లోబల్ వామింగ్ ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వారం రోజుల క్రితం జిల్లాస్థాయిలో ఆన్‌లైన్‌లో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కాగా, ఈనెల 22న తమ పాఠశాల ప్రదర్శనను ఆన్‌లైన్ ద్వారా ప్రాజెక్ట్ రూపేణ పంపాల్సి ఉంటుందన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం


బహుమతులు ప్రదానం చేస్తున్న విన్నర్స్ అకాడమీ సభ్యులు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో నాలుగు రోజుల పాటు స్థానిక విన్నర్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విన్నర్స్ అకాడమీ అధ్యక్షుడు కె.నాగరాజు మాట్లాడారు. మొదటి బహుమతి యాతవాకిళ్లకు చెందిన జక్కుల గురవయ్య టీమ్ రూ.15వేలు, షీల్డ్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. రెండవ బహుమతి అమరవరం జట్టు రూ.12వేలు, షీల్డ్, మూడవ బహుమతి విన్నర్స్ అకాడమీ జట్టు రూ.10వేలు షీల్డ్, నాల్గవ బహుమతి ఎస్సీ కాలనీ యాతవాకిళ్ల టీమ్ రూ.6 వేలు షీల్డ్ గెలుపొందినట్లు తెలిపారు.

380 మందికి వైద్య పరీక్షలు


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాలకవీడు : మండలంలోని మహంకాళిగూడెం గ్రామ పరిధిలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ మిర్యాలగూడెం మ్యాక్స్ కేర్ హాస్పిటల్ వారిచే వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. సుమారు 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, మ్యాక్స్ కేర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్లు నవీన్‌కుమార్, మౌనిక, వికాస్, రాజేంద్రప్రసాద్, గౌతమి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : లేబర్ కార్డు ఉన్న లబ్ధిదారులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పగడాల పద్మ కోరారు. శనివారం రత్నవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పలువురికి 52 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పగడాల భూపాల్‌రెడ్డి, కారంశెట్టి శ్రీనివాస్, మొలుగూరి నర్సింహారావు, గోపి, వెంకన్న వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సతీష్ కుమార్

నడిగూడెం : గ్రామాల అభివృద్ధి ప్రతి అధికారి కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా అటవీశాఖ అధికారి వి.సతీష్ కుమార్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో 2024– 25 వార్షిక ప్రణాళికపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను అన్ని శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులకు వెంటనే ఇవ్వాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ హేమామాలిని, ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిశ్రమ విస్తరణకు సమ్మతం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్, పక్కన అడిషనల్ కలెక్టర్ ప్రియాంక


ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన ప్రజలు, నాయకులు

- రెయిన్ సిమెంట్ పరిశ్రమలో ప్రజాభిప్రాయ సేకరణ
- క్లింకర్, సిమెంట్ ఉత్పత్తి, విద్యుత్ తయారీ సామర్థ్యం పెంపుదలకు మెజార్టీ ప్రజల మద్దతు
- పాల్గొన్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

మేళ్లచెరువు : మండలంలోని రామాపురం పరిధిలో గల రెయిన్ సిమెంట్ పరిశ్రమలో క్లింకర్, సిమెంట్ ఉత్పత్తుల పెంపుదల, విద్యుత్ తయారీ సామర్థ్యం పెంపుదలకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, అదనపు కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన శనివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ పరిధిలోని రామాపురం, రేవూరు, కప్పలకుంటతండా, యతిరాజపురంతండా గ్రామస్తులు ఈ మెయిల్ ద్వారా, రాత పూర్వకంగా తమ అభిప్రాయాలను వ్యక్త పరిచారు. పరిశ్రమ పరిసర గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తుండడంతో తమకు విస్తరణ సమ్మతమేనని ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎక్కువ మంది ప్రజలు తమ అభిప్రాయాలు తెలిపారు. గ్రామాల్లోని 70 శాతం నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, పరిశ్రమకు చెందిన పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు ఫీజులు తగ్గించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు కల్పించాలని వారు కోరారు.

మినరల్ ఫండ్‌తో గ్రామాల అభివృద్ధి : కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ వెంకట్రావ్, అడిషనల్ కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ స్థానికులకు ఉద్యోగాలు, అప్రెంటీస్ చేసేందుకు అవకాశం, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పలువురు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రజాభిప్రాయ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని పేర్కొన్నారు. పరిశ్రమ ఇచ్చే మినరల్ ఫండ్ ద్వారా స్థానిక, పరిసర ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. బ్లాస్టింగ్ ద్వారా ప్రజలు ఇబ్బందులు పడితే పరిశ్రమ వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా, రామాపురంలో పశువుల వైద్యశాల ఏర్పాటుకు స్థలం పరిశీలించాలని ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా కోదాడ డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఈఈ సురేష్‌బాబు, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతి, ఎంపీపీ కొట్టె పద్మ సైదేశ్వరరావు, సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ.సురేష్‌యాదవ్, పాలేటి రామారావు, భసవయ్య, మల్లికార్జున్, బాలాజీనాయక్, గురవయ్య, జనిగ సైదులు యాదవ్, శ్రీనివాసరావు, రవి, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

స్థానికులకు ప్రాధాన్యం ఇస్తాం: పరిశ్రమ డీజీఎం

పరిశ్రమలో ఉద్యోగాల కల్పనలో స్థానికులకే ప్రాధాన్యం ఇస్తామని పరిశ్రమ డీజీఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. పర్యావరణానికి హానీ కలగకుండా బ్లాస్టింగ్ జరుపుతామని, ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని, పరిసర ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. పరిశ్రమ విస్తరణతో మరో 300 మందికి కొత్తగా ఉద్యోగాలు వస్తాయన్నారు. పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్‌తో పాటు ఇంటర్ విద్య అందించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామస్తుల అవసరాల నిమిత్తం ఫంక్షన్ హాల్ నిర్మాణం, పరిశ్రమ నిర్వహించే ఆసుపత్రిలో ఎక్స్ రే, రక్త పరీక్షలు, ఉచితంగా మందులు అందించేందుకు సహాయం అందిస్తామన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి


విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న దాత, ఉపాధ్యాయులు

చిలుకూరు : మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రొఫెసర్ ముత్తు, ఎడ్ల నరసింహారావు, బొమ్మ వాసు, జుట్టుకొండ సుధాకర్, టి.లింగయ్యల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన అల్పాహారం పంపిణీని శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌జీ.శివకుమారితో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ తాళ్లూరి లక్ష్మి సూచించారు. శనివారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హెచ్‌ఎమ్ శివకుమారి, ఉపాధ్యాయులు టీవైఎల్‌ఎస్ స్వామి, రాములు, వెంకట్‌రెడ్డి, వెంకన్న, పార్వతమ్మ, అరుంధతి, సునీత, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.